గురుకులాల ప్రవేశ పరీక్ష కేంద్రాల తనిఖీ

- మౌలిక వసతులను పరిశీలించిన కలెక్టర్
- 89.97 శాతం విద్యార్థుల హాజరు

విద్యార్థి హాల్ టికెట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య శారద

పర్వతగిరి, ఫిబ్రవరి 23: మండలకేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకులాల్లో ఐదో తరగతి నుంచి తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సత్యశారద తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ, విద్యార్థుల హాజరు, ప్రశ్నపత్రాల రికార్డులను పరిశీలించారు. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. గురుకులాల్లో ఐదో తరగతి రెగ్యులర్ ప్రవేశాలతోపాటు 6, 7, 8, 9వ తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం జిల్లాలోని పది పరీక్ష కేంద్రాల్లో 4200 మంది విద్యార్థులకు 89.97 శాతం హాజరైనట్లు పరీక్షల జిల్లా సమన్వయకర్త అపర్ణ తెలిపారు. అనంతరం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ సందర్శించి 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. వసతి గృహంలో సౌకర్యాలు, మెనూ ప్రకారం అందుతున్న ఆహారం తదితర అంశాలపై ఆరా తీశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ వెంకటస్వామి, వైస్ ప్రిన్సిపాల్ జ్యోత్స్న ఉన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

నర్సంపేట/ఖానాపురం: గురుకుల ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. నర్సంపేటలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కళాశాల, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. పట్టణంలో 592 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 15 మంది హాజరు కాలేదని అధికారులు తెలిపారు. అలాగే, ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్ సైనిక్‌స్కూల్‌లో గురుకుల ప్రవేశ పరీక్షకు 326 మందికి 302 మంది(92.6 శాతం) విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ గట్ల సురేందర్ తెలిపారు.

'పోషణ్ ట్రాకర్'కు సాంకేతిక సమస్యలు

- అంగన్‌వాడీల్లో మొబైల్ ఆధారిత అప్లికేషన్
- పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా చర్యలు
- సాంకేతిక సమస్యతో ముందుకు సాగని వైనం

గిర్మాజీపేట, ఫిబ్రవరి 23: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'పోషణ్ ట్రాకర్' ఫేస్ ఐడెంటిఫికేషన్‌లో చిన్నారుల తల్లి లేదా తల్లి మరణిస్తే తండ్రి లేదా అనాథ అయితే సంరక్షకుల ముఖాన్ని క్యాప్చర్ చేయాల్సి ఉంది. కానీ, సాంకేతిక సమస్యలతో ఫేస్ క్యాప్చర్ కావడం లేదని చిన్నారుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. 'పోషణ్ ట్రాకర్' అనేది భారత ప్రభుత్వ మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ జాతీయ ఈ-గవర్నెన్స్ ద్వారా రూపొందించిన మొబైల్ ఆధారిత అప్లికేషన్. ఒక ముఖ్యమైన పాలన సాధనం. దీని ద్వారా చిన్నారుల్లో ఎదుగుదల లోపం, బరువు తక్కువగా ఉండడం వంటి సమస్యలను డైనమిక్‌గా గుర్తించడానికి, పోషకాహార సేవల డెలివరీని చివరిదశ వరకు ట్రాక్ చేసేందుకు వీలుంటుంది. దీని ఉద్దేశం మంచిదే అయినా సాంకేతిక సమస్యలతో సిబ్బంది విసుగు చెందుతున్నారు. జిల్లాలో 27,691 మంది చిన్నారులకు సంబంధించిన తల్లి లేదా తండ్రి లేదా సంరక్షుల ఫేస్ క్యాప్చర్ ప్రక్రియ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 11 వేలు పూర్తి చేసినట్లు సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు. జిల్లాలో ఫేస్ ఐడెంటిఫికేషన్ ప్రక్రియ 46 శాతం పూర్త కాగా, ఇంకా 54 శాతం మిగిలి ఉంది. 6 నెలల నుంచి మూడేండ్ల వయస్సు ఉన్న చిన్నారులకు టేక్ హోంరేషన్ ద్వారా బాలామృతం, గుడ్లు, పాలను అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పిల్లల సంబంధీకులు తీసుకెళ్లేవారు. ఒక్కోసారి పక్కదారి పట్టే అవకాశం ఉండేది. పోషణ్‌ట్రాకర్ ఫేస్ ఐడెంటిఫికేషన్ అమలు చేయడం ద్వారా అక్రమాలకు చెక్ పెట్టడానికి వీలుంటుంది. అలాగే, చిన్నారుల తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకులు టేక్‌హోంరేషన్‌ను తీసుకెళ్లేందుకు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చినప్పుడు పిల్లల ఆరోగ్యం గురించి పక్కా సమాచారం సిబ్బందికి తెలుస్తుంది. పోషణ్‌ట్రాకర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

విహారయాత్రతో విద్యార్థుల్లో మానసికోల్లాసం

జూపార్కును సందర్శించిన విద్యార్థులు

గిర్మాజీపేట, ఫిబ్రవరి 23: విహారయాత్రతో విద్యార్థుల్లో మానసికోల్లాసంతోపాటు విజ్ఞానం మెరుగవుతుందని ఎంఈవో గంప అశోక్‌కుమార్ అన్నారు. విహారయాత్రలో భాగంగా ఆదివారం మట్టెవాడ ఉన్నత పాఠశాలకు చెందిన 4, 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు వరంగల్ కోటతోపాటు జూపార్కును ఎంఈవో ఆధ్వర్యంలో సందర్శించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సులోచన, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Hema Motors needs Sales Executive: any Degree 2 wheeler must, Accountant: good Knowledge in Tally must and Min 1 to 2 Yrs of Exp in Automobile Dealership Walk in Interview with resume on 24th & 25th Feb 2025 between 11 am to 6.pm Cont: Hema Motors Pvt Ltd, Opp: Govt ITI, Mulugu Road, Wgl, Cell: 8008204442, 9154921942.
NTW-15465

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

చెన్నారావుపేట, ఫిబ్రవరి 23: ఉరేసుకొని ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని లింగాపురంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన తిక్క కల్యాణ్(38) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మత్తులో ఉన్న అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు నర్సంపేటలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

నేడు ప్రజావాణి రద్దు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 23: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పాలనా పరమైన కారణాల వల్ల రద్దు చేసినట్లు పేర్కొనారు. నేడు ప్రజలు ఫిర్యాదులు, వినతులు అందించేందుకు కార్యాలయానికి రావొద్దని కోరారు.

నేడు బల్దియాలో 'గ్రీవెన్స్ సెల్'

వరంగల్, ఫిబ్రవరి 23: బల్దియా కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే తెలిపారు. ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు నగర ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

పది మేకలు మృతి

ధర్మసాగర్, ఫిబ్రవరి 23: క్రూరమృగం దాడిలో పది మేకలు మృత్యువాత పడ్డాయి. మండలంలోని ఎలుకుర్తికి చెందిన మినుముల రమేశ్ వ్యవసాయ బావి వద్ద షెడ్ నిర్మించుకొని 20 మేకలు పెంచుతున్నాడు. శనివారం సాయంత్రం షెడ్‌కు తరలించి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం షెడ్ వద్దకు వెళ్లి చూడగా పది మేకలు, నాలుగు కోడి పిల్లలు చనిపోయాయి. రాత్రి ఏదో క్రూరమృగం వచ్చి దాడి చేసిందని, రూ. లక్ష వరకు నష్టపోయానని తెలిపాడు.

పంచాయతీల పాలన అస్తవ్యస్తం

- గ్రామాల్లో కానరాని పరిశుభ్రత
- పల్లెల్లో కరువైన పచ్చదనం
- కంపుకొడుతున్న వీధులు, కాలనీలు
- కళ తప్పిన పల్లెప్రకృతి వనాలు
- మిషన్ భగీరథ తాగునీటి సరఫరా బంద్
- నిరూపయోగంగా డంపింగ్ యార్డులు

నల్లబెల్లిలో ఎండిపోయి కళావిహీనంగా తయారైన పల్లెప్రకృతి వనం

నల్లబెల్లిలో చెత్తాచెదారంతో నిండిన డ్రైనేజీ

నల్లబెల్లి, ఫిబ్రవరి 23: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో వెలుగొందిన గ్రామ పంచాయతీలు కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత కళావిహీనంగా మారాయని గ్రామీణ ప్రజలు విమర్శిస్తున్నారు. పారిశుధ్యం పడకేసిందని, అభివృద్ధి కుంటుపడిందని వాపోతున్నారు. ఇక డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండి కంపుకొడుతున్నాయని, మిషన్ భగీరథ నీళ్లు రాక నల్లాలు నిరుపయోగంగా మారినట్లు చెబుతున్నారు. జీపీలకు అదనపు ఆదాయం సమకూర్చేందుకు ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులు మూలనపడడంతో గ్రామ పంచాయతీలకు వచ్చే ఆదాయానికి అడ్డుకట్ట పడింది. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పల్లె ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావొస్తున్నది. ఇప్పటి వరకు ఒక్క గ్రామంలో తట్టెడు మట్టిపోసిన దాఖలాలు లేవు. పారిశుధ్య పనులు చేపట్టకపోగా గ్రామాల సుందరీకరణకు స్వస్థి పలికారు. ఇప్పటికే గ్రామాల్లో తాగునీటి కొరత ఏర్పడుతున్నది. అధికారులు మాత్రం కంటితుడుపు చర్యగా మండలకేంద్రానికి వచ్చి వెళ్తున్నారు. కానీ, ఏనాడూ గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రామతీర్థంలో పిచ్చిమొక్కల మధ్య డంపింగ్ యార్డు

బీఆర్ఎస్ హయాంలో సర్వతోముఖాభివృద్ధి

బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు సర్వతోముఖాభివృద్ధి చెందాయని ప్రజలు అంటున్నారు. మల్టీపర్పస్ వర్కర్లను నియమించి నిత్యం గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడం, గ్రామాల సుందరీకరణ పనులు చేయడం, నిత్యం ఇంటింటికీ శుద్ధి చేసిన మిషన్ భగీరథ నీరు అందించడం, ప్రతి గ్రామంలో రోడ్లకు ఇరువైపులా హరితహారంలో నాటిన మొక్కలకు నీళ్లు పోయడం, పల్లెప్రకృతి వనాలు, మంకీ ఫుడ్ కోర్టుల్లో మొక్కలను సంరక్షించారు. చెత్త సేకరణకు ప్రతి ఇంటికి రెండు బట్టలు అందించారు. గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డులకు తరలించి వర్మీకంపోస్టు ఎరువు తయారు చేయించారు. రైతులకు విక్రయించడం ద్వారా జీపీలు అదనపు ఆదాయం పొందాయి. అలాగే, ప్రతి జీపికి రూ. 12 లక్షలతో శ్మశాన వాటిక నిర్మించారు. ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించేందుకు గ్రామాల్లో హెల్త్ సబ్‌సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం వాటి ఆలనాపాలన పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. దీంతో పల్లెప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోయాయని, గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరిగా సరఫరా కావడం లేదని, పారిశుధ్య పనులు చేపట్టడం లేదని, డంపింగ్‌యార్డులు నిరుపయోగంగా మారాయని వాపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి పల్లెలకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరుతున్నారు.

కన్నారావుపేటలో మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో వెలవెలబోతున్న నల్లా


మల్లమ్మకు నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి

కుటుంబ సభ్యులకు పరామర్శ

ఖిలావరంగల్, ఫిబ్రవరి 23: తూర్పుకోటకు చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేశ్ నాన్నమ్మ మల్లమ్మ(117) ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఆదివారం మహేశ్‌ను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు బిల్లా కిశోర్, బొలుగొడ్డు సతీశ్, అమృత్‌వర్ధ, ఏసిరెడ్డి రంజిత్, బేర నరేందర్, దేవర కమాలకర్, కార్తీక్, రాము, కిశోర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న కవితారెడ్డి

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

నర్సంపేట, ఫిబ్రవరి 23: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని జేడీ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కవితారెడ్డి అన్నారు. నర్సంపేట మండలం ఇటుకాలపల్లిలోని నందనంవాడలో జేడీ లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రంథాయం ఏర్పాటు చేశారు. ఆదివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. గ్రంథాలయాలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రణధీర్ కుమార్, రవీందర్, అశోక్, నరేశ్, రాజేశ్, ఉల్లెంగుల స్వామి, జమాండ్ల చంద్రమౌళి, కుమార్ పాల్గొన్నారు.

ట్రోఫీ అందజేస్తున్న సామాజిక కార్యకర్త అశోక్

విజేతలకు బహుమతుల ప్రదానం

ఖిలావరంగల్, ఫిబ్రవరి 23: ఖిలావరంగల్ మైదానంలో గ్రీన్ వారియర్స్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రైమర్ లీగ్ జడబ్ల్యూపీఎల్ సీజన్-1 క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో కాశీబుగ్గకు చెందిన ఎక్స్-1 టీం ప్రథమ స్థానం, కొత్తవాడ తోట లయన్స్ టీం ద్వితయ స్థానంలో నిలిశాయి. విజేతలకు శివనగర్‌కు చెందిన సామాజిక కార్యకర్త మేరుగు అశోక్ ముఖ్య అతిథిగా హాజరై ట్రోఫీ అందజేశారు. అలాగే, టోర్నమెంట్‌కు స్పాన్సర్‌షిప్ చేసిన రిటైర్డ్ సీఐ దిడ్డి నరేందర్, శ్రవణ్, షాహిద్, గుండు శివప్రసాద్, యుగేంధర్, అట్ల రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టోర్నమెంటు ఆర్గనైజర్లు మల్యాల వరప్రసాద్, బైరి హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

నర్సంపేట 2వ వార్డులో పెరిగిన పిచ్చిమొక్కలు

పిచ్చిమొక్కలు ఇలా..

నర్సంపేట, ఫిబ్రవరి 23: పట్టణంలోని ప్రధాన వీధుల్లో సీసీరోడ్లను పిచ్చిమొక్కలు కమ్మేస్తున్నాయి. 2వ వార్డు స్నేహనగర్ రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగాయి. కానీ, మున్సిపల్ అధికారులు ఈ వార్డు వైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి పిచ్చిమొక్కలను తొలగించకపోవడంతో విషపురుగులు సంచరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వార్డులో పారిశుధ్య పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

వరంగల్‌చౌరస్తా, ఫిబ్రవరి 23: కాపురానికి రావడం లేదని భార్యను, అడ్డువచ్చిన అత్తా మామపై విక్షణారహితంగా దాడి చేసిన కోట చంద్రశేఖర్‌ను అరెస్ట్ చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కోట చంద్రశేఖర్ పెయింటింగ్, రాడ్ వైండింగ్ పనులు చేస్తూ శంబునిపేట ఎస్సీకాలనీలో ఉంటున్నాడు. ఈ క్రమంలో 2022లో పల్లవిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి బాబు జన్మించాడు. కొంతకాలంగా చంద్రశేఖర్ మద్యానికి బానిసకావడంతో వాసవీ కాలనీలోని తన తల్లిదండ్రుల వద్ద పల్లవి ఉంటున్నది. కాపురానికి రావడం లేదని, మరో వ్యక్తితో చనువుగా ఉంటున్నదనే అనుమానంతో ఈ నెల 29న భార్య పల్లవిపై కత్తితో దాడి చేయగా, అడ్డుకోబోయిన మామ జన్ను బాబు, అత్తపై దాడి చేసి పరారయ్యాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని పాపయ్యపేట చమన్ వద్ద అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు. సీఐ టి.గోపి, ఎస్సై సాంబయ్య, విఠల్, క్రైం సిబ్బంది విజయ్‌కాంత్, నాగేశ్వర్ రావును అభినందించారు.

నేడు మార్కెటింగ్ శాఖకు టీఆర్‌లు అప్పగింత

కాశీబుగ్గ, ఫిబ్రవరి 23: ఇటీవల సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు చేసిన క్రమంలో రైతులకు సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకాల ప్రకారం పత్తి సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తాత్కాలిక సర్టిఫికెట్ జారీ చేశారు. అందులో అవకతవకలు జరిగాయని వరంగల్ రీజినల్ పరిధిలో ఏడుగురు మార్కెట్ కార్యదర్శులను ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అలాగే, వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసి 15 రోజుల్లో వివరణతోపాటు సంబంధిత టెంపర్వరీ రిజిస్ట్రేషన్ (టీఆర్) సర్టిఫికెట్లు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. సస్పెండ్ అయిన ఏడుగురు మార్కెట్ కమిటీ కార్యదర్శులు సోమవారం హైదరాబాద్‌లోని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు సంబంధిత పత్రాలు అందజేయనున్నట్లు సమాచారం.

ముగ్గురు డాటా ఎంట్రీ ఆపరేటర్లపై వేటు

వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్లు పట్టాదారు పాస్‌పుస్తకాల ఎంపికలో అవకతవకలను పాల్పడినట్లు తేలడంతో వారిపై వేటుపడే అవకాశం ఉంది. వ్యవసాయ శాఖ అధికారులతోపాటు డేటా ఎంట్రీ ఆపరేటర్లు చేసిన తప్పులకు మార్కెట్ కార్యదర్శులు సస్పెండ్ కావడంతో ఆపరేటర్ల తప్పులను మార్కెటింగ్ శాఖ గుర్తించి ఈ నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తున్నది.

27 కిలోల ఎండు గంజాయి పట్టివేత

ఇద్దరు వ్యక్తుల అరెస్టు, రిమాండ్

వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజగోపాల్

పర్వతగిరి, ఫిబ్రవరి 24: వాహన తనిఖీల్లో 27 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు పర్వతగిరి సీఐ రాజగోపాల్ తెలిపారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ప్రవీణ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. చింతనెక్కొండ సమీపంలో వైన్‌షాపు వద్ద శనివారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో ఢిల్లీకి చెందిన సంజీల షేక్(22), రోహిత్ షేక్(27) మూడు లగేజీ బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనఖీ చేయగా 27 కిలోల ఎండు గంజాయి లభించింది. వారిద్దరు అన్నాచెల్లెలు. ఢిల్లీకి చెందిన వీరు ఆంధ్ర, ఒడిశా సరిహద్దుకు వెళ్లి గంజాయి కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో పట్టుబడిన వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

50 ఏళ్ల జ్ఞాపకాలు పదిలం..

- ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- కుటుంబ సమేతంగా హాజరు

శ్రీరంగారావును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

రాయపర్తి, ఫిబ్రవరి 23: మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో 1974-75 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఎస్సెస్సీ పూర్తయి 50 ఏళ్లు గడిచిన సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట చేరారు. ఏడు పదుల వయస్సులో ఉన్న వారంతా నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా తమ కుటుంబాలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. తర్వాత పూర్వ ఉపాధ్యాయుడు శ్రీరంగారావును సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆకుల నరేందర్‌రావు, నరోత్తంరావు, కొండపల్లి ప్రసాద్‌రావు, ఏ ప్రభాకర్‌రావు, సాంబయ్య, సుధాకర్, రాములు, గుంషావళి, సికిందర్, విజయ, సత్తయ్య, మహ్మద్ ఉస్మాన్, ఎల్లారెడ్డి, భిక్షపతి, రాంచంద్రారెడ్డి, యాదవరెడ్డి, గౌరయ్య, మహేందర్, లక్ష్మీనారాయణ, సిద్దం శెట్టి అప్పయ్య పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

రాయపర్తి, ఫిబ్రవరి 23: మండలంలోని పానీష్‌తండాకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బానోత్ వెంకన్న ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మైలారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తన ఎస్ ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధుల ద్వారా వెంకన్న కుటుంబాన్ని పరామర్శించి రూ. 3500 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు లేతాకుల రంగారెడ్డి, సంది దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భూక్యా భద్రూనాయక్, బానోత్ రమేశ్, లాలూనాయక్, రమేశ్, మంచ్యా, రవి, రమేశ్ పాల్గొన్నారు.

శివరామయ్యకు నివాళులర్పిస్తున్న దయాకర్‌రావు

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా

రాయపర్తి, ఫిబ్రవరి 23: అనునిత్యం పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటున్నట్లు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పొరండ్ల సమ్మయ్య కుమార్తె రమ్య వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వందించారు. అనంతరం కొత్తూరు పరిధి గుంటూరుపల్లికి చెందిన పాతూరి శివరామయ్య దశదినకర్మకు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, పూస మధు, తోట నర్సింగం, గజవెల్లి ప్రసాద్, దొమ్మాటి సుభాష్, పాలెపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాసును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్

బీఆర్ఎస్ నేతకు నన్నపునేని పరామర్శ

కరీమాబాద్, ఫిబ్రవరి 23: గ్రేటర్ వరంగల్ 39వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బజ్జూరి వాసును తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల వాసు తండ్రి వీరేశం మరణించాడు. ఈ మేరకు కాశీకుంటలోని వాసు నివాసానికి వెళ్లి వీరేశం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

జయహో భారత్..

క్రికెట్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై ఇండియా విజయం సాధించడంతో అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు చోట్ల క్రికెట్ అభిమానులు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేసి పటాకులు కాల్చారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సంతోషం వ్యక్తం చేశారు. భారత జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు.

కార్డులను పోస్టు చేస్తున్న నాయకులు

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

పర్వతగిరి, ఫిబ్రవరి 23: గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని టీయూఎఫ్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కందికట్ల జయ, మండల అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. వారి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులతో కలిసి ఆదివారం మండలకేంద్రంలోని కల్లెడ పోస్టాఫీసులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కార్డులు పోస్టు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డులు, ప్రత్యేక సంక్షేమ బోర్డు, ఉచిత రైల్వే, బస్సు పాసులు, హెల్త్ కార్డులు, జీవిత బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీయూఎఫ్ నాయకులు బరిగెల విజయ, అర్షం కుమార్, బొట్ల మధు, నాగరాజు, వడ్లకొండ రమేశ్, గరుగు రాజు, గఫార్, బూర శ్యామ్‌